International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-2(1), February, 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# తెలుగులో బాలగేయ సాహిత్యం-దశలు

**శ్రీమతి వెంకటలక్ష్మి చెరుకూరి**
ఎస్.ఏ తెలుగు,
జడ్.పి.హెచ్.ఎస్, గౌరీపట్నం,
చరవాణి : 9494158446
Mail id : lakshmicherukuri46@gmail.com

**ఉపోద్ఘాతం:**

భావి సమాజానికి విలువలతో కూడిన పైరులను అందించాలంటే అది బాల్యం నుంచే సాధ్యమవుతుంది. అలాంటి విలువలను బాల్యంనుంచే నేర్పడంలో బాల సాహిత్యం ముఖ్యమైనది. నేటితరం పిల్లలను ఆకట్టుకునేలా వారి మనసుకు హత్తుకునేలా రచనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాల సాహిత్యం రాయాలంటే బాల్యం గురించి లోతుగా అధ్యయనం చేయాలి. ఒకప్పటి చిన్నారులకు నేటి కాలపు చిన్నారులకు ఎంతో మార్పును మనం చూస్తున్నాం, ప్రస్తుత సమాజంలో అవసరాల మేరకు నేటి రచయితలు బాల సాహిత్యాన్ని సృష్టించాలి. పిల్లలకు కేవలం నీతి కథలే కాక ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘటనలను పరిచయం చేయాలి. పిల్లల వ్యక్తిత్వ నిర్మాణంలో బాలసాహిత్యం కీలకపాత్ర వహించేలా ఉండాలి. నేటి కాలంలో సంస్కారం, మానవత్వం, నైతిక విలువలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయి. నేర ప్రవృత్తి, నిర్లక్ష్యం, బద్దకం పిల్లల్లో పెరిగి తల్లిదండ్రులన్నా, గురువులన్నా పెద్దలన్న గౌరవం లేకుండా పోతుంది. నేటి కాలంలో పిల్లలు బడికి వెళ్ళి వచ్చే యంత్రాలుగా మారిపోతున్నారు.

పిల్లలకు విలువలు ఇంటి నుంచి, విద్యాసంస్థల నుంచి సమాజం నుంచి అందాలి. పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేది. నాయనమ్మ, తాతయ్య, పిన్ని, బాబాయ్, పెద్దమ్మ, పెదనాన్న అంతా కలిసి ఒకే కుటుంబంగా జీవిస్తూ ఉండేవారు. పిల్లలకు పెద్దలు వారి అనుభవాల నుంచి ఎన్నో విషయాలను కథల రూపంలో, మంచి మాటల రూపంలో వారి మనసుకు హత్తుకునేలా చెప్పేవారు. వారిని ముద్దు చేస్తూ ఎన్నో మంచి మాటలను నేర్పేవారు. కానీ మారుతున్న పరిస్థితులు దృష్ట్యా నేటి కాలంలో ఉమ్మడి కుటుంబాల స్థానంలో పరిమిత కుటుంబాలు వచ్చి చేరాయి. తల్లి తండ్రి వారి ఇద్దరు పిల్లలు కలిసి నివసిస్తున్న కుటుంబాలు అధికం. అలాంటి కటుంబాలలో పిల్లల బాగోగులను చూసుకోవడానికి పెద్దవారికి సమయం ఉండడం లేదు. తల్లిదండ్రులు ఇద్దరు వారి ఉద్యోగాలతో నిరంతరం సతమతమవుతూ బాల్యం నుంచే పిల్లలను హాస్టల్లో చేర్పించడం లేదా బేబీ కేర్ సెంటర్లలో

చేర్పించడం జరుగుతుంది. అటువంటప్పుడు పిల్లలకు మంచి, చెడు చెప్పేవారు లేక ప్రేమతో లాలించే వారు లేక వారికి ఏది నచ్చితే అదే మంచిదనే భావనలో పిల్లలు ఉండిపోతున్నారు.

సాంకేతిక పరికరాల వల్ల పిల్లల ఊహాశక్తి, కల్పనా శక్తి తగ్గుతుంది అన్నది నిజం. నేటి కాలంలో పిల్లలకు నేల బండ, పులి మేక, చాకిరేవు బండ మొదలైన ఆటలు తెలియదంటే అతిశయోక్తి కాదు. ఒంటరిగా పరికరాలతో ఆడుకుంటూ అదే లోకంగా గడుపుతున్నారు. ఇలా ఉన్న పిల్లలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, వికాసాన్ని కలిగించే సృజనాత్మక రచనలను వారికి కథల రూపంలో, గేయాల రూపంలో, నాటికల రూపంలో పరిచయం చేస్తూ వారిలో పఠనాభిలాషను పెంపొందించేదిగా బాల సాహిత్యం ఉండాలి. పిల్లల మనసులు నిర్మలంగా ఉంటాయి. ఏది చెప్పినా నిజమే కదా అని నేర్చుకునే మంచితనం ఉంటుంది. అందుకే చిన్నవయసులోనే వారికి నీతి కథలను, మంచి నడవడికను, విలువలతో కూడిన కథలను పరిచయం చేస్తూ వారిని భావి జీవితంలో ముందుకు నడిపించడానికి బాల సాహిత్యం కృషి చేయాలి. చిన్ననాడు మనసుల్లో నాటుకున్నవి కలకాలం నిలిచి ఉంటాయి అని గుర్తెరిగి బాల సాహిత్యం సృష్టించాలి.

చిన్నయసూరి, వీరేశలింగం, గురజాడ, చింతాదీక్షితులు, నార్ల చిరంజీవి మొదలైన వారు బాలసాహిత్యం కోసం ఎంతగానో కృషి చేశారు. అన్ని పత్రికల్లోనూ నేడు బాలల కోసం ప్రత్యేక శీర్షికలను నిర్వహించడం జరుగుతుంది. బాల మిత్ర, జాబిల్లి, బుజ్జాయి, బాలభారతి మొదలైన పత్రికలు పిల్లల కోసం వెలబడ్డాయి. అలాగే టెలివిజన్లో పిల్లల కోసం ఎన్నో కార్యక్రమాలను రూపొందించడం జరుగుతుంది.

**బాల గేయ సాహిత్యం దశలు :**

1. ప్రథమ దశ
2. ద్వితీయ దశ
3. తృతీయ దశగా విభజించవచ్చు.

**1. ప్రథమ దశ – శ్రవ్య సాహిత్యం :**

మూడు నుంచి ఐదు సంవత్సరముల పిల్లలు ఈ దశకు చెందుతారు. ఈ దశలో పిల్లలు ఎక్కువగా ఇంట్లోనూ ఇంటి పరిసరాలలోనూ గడుపుతారు. తల్లిదండ్రులే వారికి తొలి గురువులు ఇల్లే మొదటి పాఠశాల. ఈ దశలో పిల్లలు వినడం పట్ల ఆసక్తిని చెబుతారు. ఈ దశలో శ్రవ్య సాహిత్యం అంటే పిల్లలను ఉద్దేశించి తల్లులు పాడే జోల పాటలు, లాలి పాటలు, చందమామ పాటలు మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి.

"ఏడవకు ఏడవకు వెర్రి నాగన్న ఏడిస్తే నీ కనులు నీలాల కారును..
జో అచ్యుతానంద జోజో ముకుందా లాలి పరమానంద రామ గోవిందా..

వటపత్ర సాయికి వరహాల లాలి నా జీవనేత్రునికి రతనాల లాలి

వారికి గేయంలోని అర్థం తెలియకపోయినా వాటిలోని నాదం వారిని పరవశింప చేస్తుంది. పిల్లవాడు ఏడుస్తున్నప్పుడు లాలి పాట పాడితే ఏడుపు మానేసి కళ్ళు అప్పగించి చూస్తాడు. అనందంతో చిరునవ్వులు చిందిస్తాడు అదే నవ్వుతున్న పిల్లవాడిని భయంకరమైన స్వరంతో బెదిరిస్తే గుక్క పెట్టి ఏడుస్తాడు. వీటివల్ల శబ్దానికి ఎంత శక్తి ఉందో అర్థం అవుతుంది. ఈ దశలో పిల్లలకు అక్షరజ్ఞానం పూర్తిస్థాయిలో ఉండదు. కాబట్టి వీరికి దృశ్య రూపంలోనే బొమ్మలు, పక్షులు, జంతువులు, వింత వింత ఆకారాలు చూపిస్తూ నెమ్మదిగా వాటి పేర్లను పిల్లలకు పరిచయం చేయడం జరుగుతుంది.

కానీ ఈనాడు మూడు సంవత్సరముల పిల్లలను నర్సరీ స్కూల్లో వేస్తున్నందున వారు చదువుతోను హోంవర్క్‌లతో సతమతమవుతూ అందమైన బాల్యాన్ని కోల్పోతున్నారు.

**2. ద్వితీయ దశ – దృశ్య సాహిత్యం :**

ఐదు నుంచి పది సంవత్సరములు ద్వితీయ దశగా చెప్పవచ్చు. ఐదు సంవత్సరములు నిండిన పిల్లల్లో సంభాషణలో అభివృద్ధి కనిపిస్తుంది. ఈ వయసు పిల్లలు క్రమంగా పాటల్ని, కథలని అర్థం చేసుకుంటారు. స్వయంగా సులభ శైలిలోని వచన రచనలు చదివి విషయ గ్రహణ శక్తిని పెంపొందించుకోగలరు. ఏమిటి, ఎందుకు, ఎట్లా ఇలాంటి ప్రశ్నలతో పెద్ద వాళ్ళని తికమక పెడుతూ వేధిస్తారు. ఈ జిజ్ఞాస పిల్లల్లోని అభివృద్ధిని చూచిస్తుంది.

ఈ దశలో పిల్లలకు బొమ్మలతో కూడిన దృశ్య సాహిత్యం ఎక్కువగా ఉపకరిస్తుంది. శ్రవ్యసాహిత్యంలో శబ్దం ప్రధానమైతే, దృశ్య సాహిత్యంలో రంగురంగులతో కూడిన బొమ్మలు ప్రధానం. ఈ దశలో పిల్లల శబ్ద, దృశ్య సాహిత్యాలతో పాటు 8 సంవత్సరాల వయసు నుండి సులభ శైలిలో వ్రాసిన శ్రవ్య పఠన సాహిత్యాలు చదవడం నేర్చుకుంటారు. ముఖ్యంగా నీతి కథలు, దేవతలు, మాంత్రికులు పాత్రలుగా గల అద్భుత రసకథలు, పశుపక్ష్యాదులు పాత్రలుగా గల కథలు, పిల్లల్లో ఆసక్తిని పెంచడమే కాక కుతూహలాన్ని రేకెత్తిస్తుంది. సత్ప్రవర్తన, నీతి, విలువలతో కూడిన కథలను పరిచయం చేస్తే అవి పిల్లల మనసుల్లో చక్కగా హత్తుకుంటాయి. ఉదా : ఆవు –పులి కథ, నాన్నా –పులి కథ, బాలనాగమ్మ కథ మొదలైనవి.

**3. తృతీయ దశ – పఠన సాహిత్యం :**

11 నుంచి 15 సంవత్సరాల వయసు వరకు తృతీయ దశ దీనినే కౌమార దశ అని కూడా అంటారు. ఈ దశలో పఠన సాహిత్యం ప్రథమంగాను, దృశ్య, శ్రవ్య సాహిత్యాలు ద్వితీయంగానూ ఉండాలి. నీతి కథలు అద్భుత కథలు, హాస్య కథలు, వీర గాథలు మొదలైనవి వచన రూపంలో ఉంటాయి.

ఉదా : కాశీ మజిలీ కథలు, నలుగురు మంత్రుల కథలు, బట్టి విక్రమార్క కథలు, బేతాళ కథలు

మొదలైనవి. ఇవన్నీ గ్రంథస్థమై ఉన్నాయి.

జ్ఞానం వల్ల సర్వ కార్యాలను సక్రమంగా నిర్వర్తించవచ్చనే విషయం నలుగురు మంత్రుల కథల ద్వారా, బట్టి విక్రమార్కుని కథలలో విక్రమార్కుని కార్య సూరత్వం, అనుకున్న పని తప్పక సాధించి తీరాలనే పట్టుదల, పరిపాలన విధానం మొదలైనవి ఆదర్శప్రాయాలుగా గుర్తిస్తాడు.

**ముగింపు :** పిల్లల మనసు తెల్ల కాగితం లాంటిది దానిమీద ఏ విధంగా రంగులను చిత్రిస్తామో ఆ విధంగానే వారు తయారవుతారు. అందుకనే బాల్యం నుంచే వారికి నీతి, విలువలతో కూడిన కథలను బాల సాహిత్యం ద్వారా పరిచయం చేయడం వలన భవిష్యత్తులో వారు సమాజంలో నిలదొక్కుకుని ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దబడతారు. విలువలతో కూడిన వ్యక్తులుగా బాలలు మారడంలో బాల సాహిత్యం ఎంతగానో తోడ్పడుతుందనేది నిర్వివాదంశం. కాబట్టి రచయితలు విలువలతో కూడిన సాహిత్యాన్ని బాలలకు పరిచయం చేసి వారి మానసిక అభివృద్ధికి, సర్వతోముఖాభివృద్ధికి అవసరమైనటువంటి రచనలను బాల సాహిత్యం ద్వారా అందించవలసిన అవసరం ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు బాల గేయ సాహిత్యం – డాక్టర్ యం.కె.దేవకి
2. బాల గేయాలు – డాక్టర్.ఎస్. గంగప్ప